క్లుప్తంగా

'కాంగ్రెస్ డిక్లరేషన్'పై అవగాహన



కాలనీవాసులకు డిక్లరేషన్ గురించి వివరిస్తున్న సాజిద్‌ఖాన్, సుజాత

ఆదిలాబాద్‌అర్బన్: గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా నాయకులు యువత డిక్లరేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే యువత కోసం జాబ్ క్యాలెండర్, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రైతు డిక్లరేషన్‌లో భాగంగా రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల పంట రుణాలు మాఫీ చేస్తామని, ఎకరాకు రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని పేర్కొన్నారు. రూ.500 లకే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తామని, ఇంట్లో ఇద్దరు వృద్ధులకు రూ.5 వేల చొప్పున పింఛన్ సౌకర్యం కల్పిసామని తెలిపారు. నాయకులు సంజీవ్‌రెడ్డి, నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో డీఎస్పీ

- తొలి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిలాబాద్ నుంచే



ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల ధర్మ సమాజ్ పార్టీగా అవతరించిన డీఎస్పీ తొలిసారిగా ఎన్నికల బరిలో నిలువనుంది. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అండతో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్నట్లుగా తెలిపారు. కాగా, ఆ పార్టీ తరఫున ఆదిలాబాద్ నియోజకవర్గ అభ్యర్థిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్‌ను ప్రకటించారు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వ్యక్తమవుతోంది.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఓ మహిళ మెడలో నుంచి సోమవారం రాత్రి బంగారు గొలుసును దొంగ ఎత్తుకెళ్లాడు. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రాత్రి 10 గంటల సమయంలో మహిళ తన ఇంటి సమీపంలోని ఓ ఇంటికి పని నిమిత్తం వెళ్లింది. తిరిగివస్తుండగా గుర్తుతెలియని దుండగుడు ఆమె మెడలో నుంచి గొలుసు లాక్కొని పరారీ అయ్యాడు. సదరు మహిళ కేకలు వేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మంగళవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

కంది శ్రీనివాసరెడ్డిపై ఫిర్యాదు



డీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేస్తున్న భరత్ చౌహాన్

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డిపై గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహన్ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈనెల 16న ఖానాపూర్ నియోజకవర్గ టికెట్ ఇదివరకే ఖరారైందంటూ ఉట్నూర్ మండలంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రకటించిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్‌లో చేరి రెండు నెలలు గడువక ముందే ఇలా చెప్పడం సరికాదన్నారు. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాద చేసినవారిలో ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు పుర్క బాపు రావు, జాదవ్ సునీల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కౌసర్, పంద్ర చిన్ను ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి

నేరడిగొండ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కిష్టాపూర్‌కు చెందిన ఆరుషి జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటడంతో మంగళవారం ఆమెను అభినందించారు. స్థానిక సర్పంచ్ పెంట వెంకటరమణ ఆ విద్యార్థినికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ..

- సక్రమంగా జరగని జొన్న కొనుగోళ్లు
- రోజుల తరబడి వేచిచూస్తున్న రైతులు
- లారీల కొరతతో నిలిచిపోతున్న కొనుగోళ్లు



చెట్లకింద సేదతీరుతున్న రైతులు



రోడ్డు వెంట కుప్పలుగా పోసిన జొన్నపంట

తాంసి: జొన్నపంట కొనుగోలు సక్రమంగా జరగకపోవడంతో రైతులు పంటను విక్రయించేందుకు నానాఅవస్థలు పడుతున్నారు. విక్రయించడానికి పంటను మార్కెట్‌కు తీసుకొచ్చిన సమయంలో కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రం వద్ద అన్నదాతలు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తాంసి మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో సహకార సంఘం ఆధ్వర్యంలో 15 రోజుల క్రితం జొన్న కొనుగోళ్లు చేపట్టారు. వివిధ కారణాలతో తరుచూ రెండు నుంచి మూడు రోజుల పాటు అధికారులు కొనుగోళ్లను నిలిపివేస్తున్నారు. దీంతో రైతులు మార్కెట్‌లోని పంట వద్ద కాపలాగా ఉంటున్నారు. సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లారీల కొరత.. గోదాంలు లేక..

జొన్నల కొనుగోళ్లను గత నెల 29న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్ ప్రారంభించారు. కానీ ప్రారంభించిన మొదటి రోజు గన్నీ సంచుల కొరత కారణంగా కొనుగోళ్లు చేపట్టలేదు. జూన్ 4వరకు తాత్కాలికంగా వాయిదా వేసి మళ్లీ కొనుగోళ్లు చేశారు. అయితే సబ్ మార్కెట్‌యార్డుకు రైతులు పెద్దఎత్తున జొన్న పంటను తీసుకురావడంతో నిల్వలు పేరుకుపోయాయి. కొనుగోలు చేసిన జొన్నలను తరలించేందుకు లారీల కొరత కారణంగా తాత్కాలికంగా వారం రోజులు నిలిపివేశారు. ఇరవై రోజుల్లో కేవలం ఐదు రోజులు మాత్రమే కొనుగోళ్లు చేపట్టారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు పంటను విక్రయించేందుకు తమవంతు ఎప్పుడు వస్తుందోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.

రైతుల పడిగాపులు

రైతులు పంటను అమ్ముకోవడానికి రాత్రి, పగలు అక్కడే ఉండి పడిగాపులు కాస్తున్నారు. తీసుకొచ్చిన పంటను ఎలాగైనా విక్రయించుకోవాలని అష్టకష్టాలు పడుతున్నారు. మార్కెట్‌యార్డులో సరైన వసతులు లేక చెట్ల కింద సేద తీరుతున్నారు. తాగునీరు అందుబాటులో లేక వెంట తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన కుప్పలు పోయడంతో వాహనాలు వచ్చిన సమయంలో పంట దెబ్బతింటుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతంగా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఐదు రోజులుగా వేచి ఉన్నా



రబీలో నాలుగు ఎకరాల్లో జొన్నపంట సాగు చేశాను. దిగుబడి వచ్చిన జొన్నలను విక్రయించడానికి తాంసిలోని మార్కెట్‌యార్డుకు తీసుకెళ్లాను. అధికారులు లారీల కొరతతో కొనుగోలను నిలిపివేస్తున్నారు. ఐదు రోజుల పాటు అక్కడే పంటకు కాపలాగా ఉంటున్నాను. – సొదరి ఇస్తారి, రైతు, తాంసి

ఆలస్యంతో ఇబ్బంది



జొన్నల కొనుగోల్లు ఆలస్యం కావడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. గత రెండు రోజుల క్రితం జొన్నలను అమ్మడానికి తీసుకొచ్చాను. ఎప్పుడు పంటను కొంటారో? ఎప్పుడు నిలిపివేస్తారో తెలియని పరిస్థితి. అధికారులు స్పందించి వెంటనే కొనుగోళ్లు చేయాలి. – సోమ వికాస్‌రెడ్డి, జామిడి

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి/ఉట్నూర్‌రూరల్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ పేర్కొన్నారు. మన ఊరు–మన బడిలో భాగంగా ఇంద్రవెల్లి మండలంలోని అందునాయక్‌తాండలోని పాఠశాల, ఉట్నూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతిగదులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య జీవితానికి తొలిమెట్టు అని, ప్రతి ఒక్కరికీ ఉన్నత చదువు అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సర్కారు బడులను తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. నాణ్యమైన విద్యబోధనతోపాటు సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. అనంతరం ఉట్నూర్‌లోని అంబేద్కర్ వీధిలో మాల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఉట్నూర్‌లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఎంపీపీ జైవంత్‌రావు, వైస్‌ఎంపీపీ బాలాజీ, పీఏసీఎస్ చైర్మన్ ఎస్పీ రెడ్డి, ఎంఈవోలు శ్రీనివాస్, నారాయణ, సర్పంచ్ కోరెంగా గాంధారి, ఎంపీటీసీ స్వర్ణలత, ఏఎంసీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరాం నాయక్, బీఆర్ఎస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

తాంసి: కప్పర్ల పాఠశాలలోనూతనంగా నిర్మించిన గదులను, డిజిటల్ బోర్డులను స్థానిక సర్పంచ్ సదానంద్ ప్రారంభించారు. హెచ్ఎంలు కిష్టన్న, రాజేశ్వర్ రెడ్డి, రాజన్న, సంజీవ్, సౌజన్య, సర్పంచులు సదానంద్, నర్సింగ్, వెంకన్న, కృష్ణ, శ్రీనివాస్ ఉన్నారు.

బోథ్: పిప్పల్‌ధరిలో మండల పరిషత్ నుంచి రూ. 8 లక్షల నిధులతో నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గదిని ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రారంభించారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ధరణి రాజేశ్, విద్యార్థినులు

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో కలిసి బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వం గురుకులాలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్యతోపాటు భోజన సౌకర్యం కల్పిస్తోందన్నారు. ప్రిన్సిపాల్ బానోత్ హరిత, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు తన్నీరు సతీశ్, నాయకులు ముజీబ్, సుబేర్, అబ్రార్, సుశీల్, సుమన్, నవీన్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్
- ప్రజాప్రతినిధులు ఫోన్ చేస్తే స్పందన కరువు
- సమస్యలపై అధికారుల నిలదీత
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కనక మొతుబయి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. ముందుగా సమస్యలపై సభ్యులు ప్రశ్నలు లేవనెత్తడంతో సమావేశం వాడీవేడిగా సాగింది. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు అధికారులకు ఫోన్ చేస్తే ఎత్తడం లేదంటూ సభాదృష్టికి తెచ్చారు. శాఖల అధికారులను నిలదీశారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయని విద్యుత్ అధికారులు మాకొద్దని భీంపూర్ సర్పంచ్ తెలిపారు. అధికారులు స్థానికంగా ఉండి విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలు ప్రారంభమైనా మన ఊరు–మనబడి పనుల జాప్యంపై చైర్మన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు చేయించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని అధికారులను నిలదీశారు. త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని జేఈ సునీల్ రాథోడ్ ఆదేశించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ఎవరైన ఫోన్లు చేస్తే సమస్యలను విని పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. అత్యవసర పరిస్థితి ఉంటే నా దృష్టికి తీసుకురావాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పనిచేసే అధికారులకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. సభ్యులు సభాదృష్టికి తెచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేష్, ఎంపీడీవో రమేశ్, డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్, సీడీపీవో శారద, ఎంఈవో ఆశన్న, పీఆర్ జె.ఈలింగన్న ఆర్‌డబ్ల్యూఎస్ సుభాని పాల్గొన్నారు.

సర్వర్ డౌన్‌తో ఇక్కట్లు

తాంసి: కులవృత్తులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ రుణం కింద రూ.లక్ష సాయం అందించనుంది. ఇందుకుగాను కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం భీంపూర్ మండలంలోని ప్రజలు మీసేవలో దరఖాస్తు చేసుకున్నారు. పదిరోజులవుతున్నా సర్వర్ డౌన్‌తో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.



భీంపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న ప్రజలు



తాంసిలో విద్యార్థుల మానవహారం



తలమడుగు పాఠశాలలో..



ఇచ్చోడ: ముఖరా (కె)లో పాఠశాలలో..

ఘనంగా విద్యా దినోత్సవం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యాదినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అన్ని పాఠశాలల విద్యార్థుల ర్యాలీ నిర్వహించి అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. పదిలో ప్రతిభ కనబర్చిన వారిని సన్మానించారు. హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు, టీచర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇంద్రవెల్లిలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ



నేరడిగొండ: నోట్‌బుక్‌లు అందజేస్తున్న జెడ్పీటీసీ

ఎస్ఎంసీ చైర్మన్లకు సన్మానం



మల్లికార్జున్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తాంసి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విద్యా దినోత్సవంలో పిప్పల్‌కోటి, అంతర్గాం పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్లను సన్మానించారు. కలెక్టర్, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌లు వారికి శాలువా కప్పి సత్కరించారు. జిల్లాలో ఉత్తమ ఎస్ఎంసీ చైర్మన్‌గా అంతర్గాం పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఖాదర్ ఎంపిక కాగా, పిప్పల్‌కోటి ప్రాథమిక పాఠశాలకు తన స్వంత స్థలాన్ని ఎస్ఎంసీ చైర్మన్ మల్లికార్జున్ ఉచితంగా అందజేశారు. వీరిని కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్న, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ సన్మానించి, ప్రశంసపత్రం అందించారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న పాయల్ శంకర్

బోథ్: ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ కార్యకర్తలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని షాదీఖానాలో నియోజకవర్గస్థాయి పార్టీ మోర్చాల సంయుక్త సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 31 వరకు నిర్వహించే గడప గడపకూ బీజేపీ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలను వివరించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను తెలిపాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బోథ్‌లో ఎగిరేది కాషాయజెండా అని గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ తెలిపారు. అంతకుముందు అంబేద్కర్, శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడె మానాజీ, పార్లమెంట్ కో కన్వీనర్ మయూర్ చంద్రబోస్, బోథ్ అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్ గిత్తే, జిల్లా ఉపాధ్యక్షులు బాబురావ్, మాధవ్ రావ్ ఆమ్టే, సామ సంతోష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నాకర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరపరాజు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సామూహిక అక్షరాభ్యాసం

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం 30 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సర్పంచ్ లింబాజీ, ఉప సర్పంచ్ రవీందర్, అంగన్‌వాడీ టీచర్లు మీరాబాయ్, సుజాత ఉన్నారు.

సన్మానం

నేరడిగొండ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం వడూర్ జెడ్పీ సెకండరీ పాఠశాలలో ప్రముఖ వ్యాపారవేత్త నాయిడి శంకర్‌ను సన్మానించారు. ప్రతిఏటా పాఠశాలకు ఆర్థికసాయం చేయడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఆయన్ను సత్కరించారు. హెచ్ఎం భారతి ఉన్నారు.

ముందస్తు అరెస్టు

నేరడిగొండ: హైదరాబాద్‌లోని బంజారా సభకు వెళ్తున్న గిరిజన లంబాడీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్‌తోపాటు లైవ్ నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. వారిని నేరడిగొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఎన్ఎస్‌యూఐలో చేరికలు

ఉట్నూర్‌రూరల్: మండలకేంద్రంలో పలువురు ఏబీవీపీ నాయకులు ఎన్ఎస్‌యూఐలో చేరారు. ఎన్ఎస్‌యూఐ జిల్లాప్రధాన కార్యదర్శి కళ్యాణ్ రాథోడ్, నాయకులు ఉన్నారు.

గ్రామదేవతకు పూజలు

ఇచ్చోడ: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణులు గ్రామదేవతలకు మంగళవారం పూజలు చేశారు. ప్రతి ఏటా జూన్‌లో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందని సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ తెలిపారు.

22 నుంచి జొన్నల కొనుగోళ్ల నిలిపివేత

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈనెల 22 నుంచి జొన్నల కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్లు పీఏసీఎస్ సీఈవో ఈశ్వర్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నేరడిగొండ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో మంగళవారం వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నేరడిగొండ యువతకు వారి కోరిక మేరకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు. దీంతోపాటు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. స్థానిక ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి అక్కడ ఉన్న స్థలం బాగు చేస్తానని హామీ ఇచ్చి తనవంతుగా రూ.5వేలు అందించారు.

పరామర్శ

బజార్‌హత్నూర్: బీఆర్ఎస్ బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు దీసీ విజేందర్ తల్లి సుశీల అనారోగ్యంతో మృతి చెందింది. మండల కేంద్రంలోని బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ మంగళవారం పరామర్శించారు. రాజారాం, సాయన్న, విలాస్, జగదీశ్, పోతన్న, మహబూబ్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

తాంసి: వడ్డాడిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇన్‌చార్జి సీడీపీవో నర్సమ్మ మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలో చిన్నారుల హాజరుశాతం పరిశీలించారు.

బీఆర్ఎస్ నేతలకు కమీషన్‌గా భగీరథ

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్

ఇంద్రవెల్లి: ఖానాపూర్ నియోజకవర్గంలో మిషన్ భగీరథ పథకం.. బీఆర్ఎస్ నేతలకు కమీషన్‌గా మారిందని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ విమర్శించారు. బీజేపీ భరోసా యాత్రలో భాగంగా మండలంలోని దోడంద, గట్టెపల్లి, చిలటిగూడ, టేకిడిగూడ, కొలాంగూడ గ్రామాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భగీరథ నీరు సరఫరా కావడం లేదని, మంచినీటి పథకాలు పనిచేయడం లేదన్నారు. నీటి కోసం ప్రజలు గొంతెండుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అనంతరం దోడంద గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మెస్రం రాము కుటుంబీకులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. బీజేపీ జిల్లా నాయకుడు జాదవ్ రెడ్యానాయక్, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, నాయకులు దిలీప్ మోరే, రాజువర్ధన్, ముండే రాజేశ్వర్ ఉన్నారు.



గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

బీజేపీలో చేరిక

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీలో చేరారు. ఆయన వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు కొండేరి రమేశ్, రాజశేఖర్, రాచందర్, వాసు, దేవిదాస్, కిరణ్, శేషరావు, యోగేవ్ తదితరులు ఉన్నారు.

పుస్తకాల పంపిణీ

జైనథ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మాండగడ పాఠశాలలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ముడుపు ప్రశాంత్ రెడ్డి విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రశాంత్‌రెడ్డిని సన్మానించారు. సర్పంచ్ మహేందర్రావు, మల్లారెడ్డి, ప్రభాకర్, నవీన్ రెడ్డి, ఉపాధ్యాయులు రమేష్, రామకృష్ణ, స్వాతి, అరుణ, షాబాద్ పాల్గొన్నారు.



పుస్తకాలు అందిస్తున్న ప్రశాంత్‌రెడ్డి, తదితరులు